


సుఖదుఃఖాల్ని నిర్వికారంగా స్వీకరించడానికి – సర్వ సంగపరిత్యాగేం కాదు సుబ్రహ్మణ్యం.

ఎంత హుషారుగా సిటీ బస్సెక్కాడో, దిగిం తరవాత అంతగానూ దిగాలు పడిపోయాడు

అదీ – ఐదు నిముషాల వ్యవధిలో ...

అసలే అంతంత మాత్రం ఆరోగ్యం. ఆపైన లంఖణాలు చేసినవాడిలా, నీరసంగా ఇంటికొచ్చిన భర్తని చూసి కంగారు పడిపోయింది కాంతం.

''ఏవిటి అలా ఉన్నారు?'' అడిగింది ఆత్రుతగా.

''...............''

''మాట్లాడరేవిటి!''

''...............''

''మీ ఆఫీసరేవన్నా అన్నాడా ?''

''ఇబ్బే ! అదేంకాదు.''

''మరేవిటి చెప్పండి !''

''జేబులో పర్సు కొట్టేశారెవరో'' అప్పటికి మాట్లాడాడు సుబ్రహ్మణ్యం.

''ఎంతుంది అందులో'' కాంతం మాటల్లో వణుకొచ్చేస్తోంది.

''ఈరోజు తీసుకున్న ఐదువందలు అందులోనే ఉన్నాయి.''

డబ్బుపోయిందన్న ఉదుకుమొత్తనం ఆపుకోలేక పెద్దగా ఏడ్చేసింది కాంతం. ఆరువాటాలున్న లద్దెయిల్లది. ఏడుపు విని ఏమైందో అన్న కంగారుతో చూడ్డానికొచ్చార – పక్కింటి పిన్నిగారు, ఆవిడ భర్త.

''ఏడుపు ఆపు – పెద్ద గొంతేసుకొని'' విసుక్కున్నాడు సుబ్రహ్మణ్యం.

''ఏం జరిగిందమ్మా కాంతం !'' అంటూ పక్కన చతికలబడింది పక్కింటి పిన్నిగారు.

''ఆయన జేబులో డబ్బు ఐదొందలు పోయిందండోయ్ పిన్నిగారు !'' మళ్ళీ బావురుమంది కాంతం.

''ఏవిటోయ్ సుబ్రహ్మణ్యం'' నిజవేనా అన్నట్టుగా చూసారు పిన్నిగారి భర్త.

''మరేనండి !''

''అసలెలాపోయింది ?''

''సిటీబస్‌లో కొట్టేశారు.''

''పోలీస్ రిపోర్టిచ్చిరా !– ఎందుకైనా మంచిది'' సలహా యిచ్చేరు పిన్నిగారి భర్త.

ఆ సలహా తక్షణ కర్తవ్యంగా తోచింది సుబ్రహ్మణ్యానికి. రిపోర్టివ్వడానికి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళేడు.

ఏవిటో – ఖర్మ కాకపోతే, రోజూ రిక్షా ఎక్కే తనకి ఈరోజే సిటీబస్సెక్కాలనిపించాలా. ఒకటా, రెండా – ఐదు వందలు. నెల్లాళ్ళ క్రితం 'లోన్'కి దరఖాస్తు పెడితే యిప్పటికి వచ్చింది. ఆ డబ్బు మీద తను ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. ఆడపిల్లిద్దరికీ ఓ జత గౌనులు, తనకో పేంటు, షర్టు తీసుకోవాలనుకున్నాడు. ఇందులోనే, బావమరిది దగ్గర తీసుకున్న ఎందా తిరిగి యివ్వాలి. ముఖ్యంగా రేపు తండ్రి ఆబ్దీకం ఖర్చు కూడా దీంట్లోనే సరిపెట్టుకోవాల్సుంది. ఇప్పుడెలా ? భగవంతుడి దయవల్ల పోయిన పర్సు దొరికితే —

''నడిసెడతన్నారేటండి బాబూ! రిక్షా ఎక్కండి'' అలవాటయిన రిక్షావాడి పిలుపుతో సుబ్రహ్మణ్యం ఆలోచనలు చెదిరిపోయాయి.

''వద్దులేరా !'' అనేసి ఎదురుగా కనిపిస్తున్న పోలీస్‌స్టేషన్ గుమ్మం ఎక్కాడు.

''నా పర్సు పోయింది – రిపోర్టివ్వడానికి వచ్చాను'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

మధ్యాహ్నం భోజనానికి వెళ్ళినట్టున్నాడు – సబ్‌ఇనస్పెక్టర్ కుర్చీ కాళీగా ఉంది.

వచ్చిన మనిషికేసి చూసాడు హెడ్‌కానిస్టేబుల్. ఈ మాటలు వినడం మాకేవీ కొత్తకాదు అన్నట్టుగా ఉంది ఆ చూపు.

''వివరాలు చెప్పండి'' అంటూ అలవాటయిన ధోరణిలో కాగితం, పెన్నూ తీసాడు.

''నా పేరు సుబ్రహ్మణ్యం'' చెప్పేడు.

''ఏం పని చేస్తూంటారు ?''

''గవర్నమెంటు ఆఫీసులో యు. డి. క్లర్కు''.

''పోయిన డబ్బెంత ?''

''ఐదు వందలు.''

''విడి నోట్లా ? వందకయితాలా ?''

# నిర్ణయం

"అన్నీ వందకాయితాలే."

"ఎప్పుడు పోయింది ?"

"ఈ రోజే... సుమారు ఒంటిగంటన్నర అయ్యుంటుంది."

"ఎక్కడ పోయింది ?"

"సిటీబస్సెక్కేముందు ఉంది — దిగింతరవాత చూసుకుంటే లేదు."

"ఈ కింద సంతకం పెట్టండి" కాయితం సుబ్రహ్మణ్యం ముందుకి తోసాడు హెడ్‌కానిస్టేబుల్.

ఓసారి చదువుకుని సంతకం చేసి యిచ్చేశాడు.

"రేపోసారి కనిపించండి ! వివరాలేవన్నా తెలిస్తే చెపుతాం" మళ్ళీ తనే అన్నాడు హెడ్‌కానిస్టేబుల్.

అలాగే అన్నట్టుగా తలూపి పోలీస్‌స్టేషన్ నుంచి బయటపడ్డాడు సుబ్రహ్మణ్యం.

* * *

ఏదో ఒకటి చెయ్యాలి...

సబ్‌యినస్పెక్టర్ సత్యం తన సీట్లో అసహనంగా కదిలేడు. జరిగింది తల్చుకొనేకొద్దీ, అతనిలో ఆవేశం ఎక్కువవుతోంది...

అసలిలా జరగడానికి అవకాశం ఎక్కడ దొరికింది? బహుశా—తను వస్తూండగా, రోడ్డుమీద కొట్లాడుతుంటున్న గుంపుని ఆపడానికి వెళ్ళినప్పుడు జరిగుండొచ్చు. ఇంతవరకూ తన సర్వీసులో ఇలా జరగలేదు. తన జేబులో పర్సు కొట్టేయడవా ... అదీ డ్యూటీలో ఉండగా ... ఇది పోలీస్ వృత్తికే అవమానం పైగా తనకో సవాల్ లాంటిది. తప్పదు ... ఏదో ఒకటి చెయ్యాలి —

"పరమేశం" పిల్చాననుకున్నాడు. కాని గట్టిగా అరిచేడు.

"యస్ సార్ !" సెల్యూట్ చేసి నిలబడ్డాడు హెడ్ కానిస్టేబుల్ — పరమేశం.

"మన ఏరియాలో మొత్తం జేబుదొంగల లిస్ట్ ఉందా ?"

"ఉంది సార్ !"

"ఆ ఫైలు పట్రా !"

"ఎందుకు సార్ ? ఎవరైనా రిపోర్టిచ్చారా ? అయినా — తిరిగేప్పుడు వళ్ళూపై తెలియకుండా తిరగడం; ఆపైన డబ్బు పోయిందంటూ మన మొహాన్ని ఓ కాయితం రాసి పడేయడం. ఇంతకీ రిపోర్టిచ్చిందెవరు సార్ !"

"పోయింది నా పర్సేనయ్యా" హెడ్ కానిస్టేబుల్‌ని మింగేసేలా చూస్తూ అన్నాడు ఇనస్పెక్టరు.

అదిరిపడ్డాడు హెడ్ కానిస్టేబుల్.

ఎదురు దెబ్బ తగిలిందే ... తను అనవసరంగా వాగాడు. ఊరుకున్నాబాగుండిపోయేది. తను మాత్రం కలగన్నాడా — పోయింది ఆయన పర్సేనని. ఇప్పుడేవిటి చెయ్యడం ? క్షణంలో ఓ నిర్ణయానికి వచ్చేసేడు.

"క్షమించండి సార్ ! పొరపాటయింది. పర్సులో ఏ మాత్రం డబ్బుందిసార్ !" వినయంగా అడిగేడు.

"నాలుగు వందకాయితాలు, ఇంకా చిల్లర నోట్లు ఓ యిరవయి దాకా ఉండాలి"

"ఈ మాత్రానికి మీ రెందుకు సార్ ! నాకో అవకాశం యివ్వండి. మీ డబ్బు చేతికొచ్చేలా చేస్తాను.,

హెడ్ కానిస్టేబుల్ మాటలు — ఇనస్పెక్టరు సత్యం ఆవేశం మీద నీళ్ళుచల్లి ఆలోచనల్ని రేకెత్తించేలా చేసాయి.

అవును — పరమేశం అన్నంత పనీ చెయ్యగల్డు. తనకున్నా ముందునుంచీ యిక్కడే ఉంటున్నాడు. తనొచ్చి యింకా ఆర్నెల్లయినా కాలేదు. ఇక్కడి జేబుదొంగల సంగతి తనకన్నా పరమేశానికే బాగా తెలుసు. రేపు భార్య పుట్టింటి ప్రయాణానికని, పొద్దున్నే బ్యాంక్‌లోంచి తెచ్చాడు తను. ముందు డబ్బు చేతికొచ్చేస్తే, మిగతా విషయాలు తర్వాత చూడొచ్చు —

"సరే ! ముందు నువ్వాపని చూడు. రాత్రి పది గంటలదాకా నేను స్టేషన్‌లోనే ఉంటా. అంతకీ కాకపోతే, అప్పుడే చూపిస్తా నా సత్తా ఏవిటో" పట్టుదలగా అన్నాడు యినస్పెక్టరు సత్యం.

* * *

ముత్యాలుగాడ్ని పట్టుకోవాలి...


ఆంధ్రపత్రిక

ఆదివారం

అనుబంధంలో

★ విజయవాడ, మదరాసు, హైదరాబాదు సినిమా వార్తలు

★ ప్రేక్షకుల తీర్పు

చదవండి !


తప్పదు — తను యినస్పెక్టర్ కిచ్చిన మాట నిలబెట్టుకోవాలంటే, వాడ్ని కలుసుకుతీరాలి. వాడే ఈ ఏరియాలో జేబుదొంగలకి నాయకుడు.

పట్టువదలని విక్రమార్కుడిలా — అప్పటికి నాలుగ్గంటలనుంచీ వెతుకుతున్నాడు హెడ్‌కానిస్టేబుల్. చివరికి రాత్రి ఎనిమిదయిం తరవాత ముత్యాల్ని వాడి యింటిదగ్గర కలుసుకో గలిగాడు.

హెడ్‌కానిస్టేబుల్‌ని చూడగానే, మందు కొట్టడానికని ముందు పెట్టుకున్న సరంజామానంతా పక్కకి సర్దేశాడు ముత్యాలు.

"ఈ యదవ మర్యాదలకేంలే" కోపంగా అన్నాడు హెడ్‌కానిస్టేబుల్.

"హేడ్‌గారు మంచి కాకలో ఉన్నట్టున్నారు. సంగతేటి ?" అంటూ నవ్వాడు ముత్యాలు.

"ఏరా ! మీరు మా జేబులుకూడా కొట్టేసే స్టేజీ కొచ్చారన్నమాట."

"మీరంనేది ఏవిటో నా కర్థం కావటంలేదు."

"ఎల్లా అవుద్ది అర్థం... ఈ వేళ మధ్యాహ్నం మా ఎస్. ఐ గారి పర్సు కొట్టేశారు మీవాళ్ళు. ఇంత ధైర్యం ఎలా వొచ్చిందిరా మీకు ?" దబాయించి అడిగేడు హెడ్‌కానిస్టేబుల్.

"ఇయ్యాల అసలు మావోళ్ళకి చిక్కిందే ఒక పర్సు. అదీ సిటీబస్‌లో. ఆ తర్వాత మళ్ళీ బోణీ లేదు. నన్ను నమ్మండి" అన్నాడు ముత్యాలు.

"ఇవ్వన్నీ నా కనవసరం. అవతల ఆయన మండిపడిపోతున్నాడు. ఆయన పర్సులో నాలుగొందల యిరవై రూపాయలుండాలి. మర్యాదగా యిచ్చారా సరి; లేకపోతే చువ్వల్లెక్కెడుతూ కూర్చోవాలి."

"మీరలా అంటే ఇంక చేసేదేవుందీ. ఆ పర్సులో ఉన్న ఐదొందల్లోది యిస్తాలి. మరి లేని పర్సు ఎక్కడ్నించొస్తాది."

"అయ్యన్నీ నాకొదిలిపెట్టి ముందు డబ్బు తియ్యి."

"ఈ రోజు బాగోలేదు. వచ్చిందనుకున్నది కూడా పోతోంది" సణుక్కుంటూ డబ్బిచ్చాడు ముత్యాలు.

డబ్బు తీసుకొని, ముత్యాల్ని మరోసారి హెచ్చరించి స్టేషన్ కొచ్చాడు — హెడ్‌కానిస్టేబుల్.

"ఏమైంది ?" అడిగేడు యినస్పెక్టర్...

"యదవల్ని తన్ని మరీ తెచ్చానుసార్ డబ్బు" అంటూ నోట్లు టేబుల్ మీద పెట్టాడు హెడ్‌కానిస్టేబుల్.

"మరి పర్సేదీ ?"

"గుర్తు దొరుకుతుందేమోనని, పర్సెక్కడో పారేశార్ట సార్ ! యదవలు."

"ఓ. కే. మిగతా విషయాలు రేపు చూద్దాం" అంటూ ఇంటికి వెళ్ళడానికి లేచాడు యినస్పెక్టర్ సత్యం.

* * *

"కొత్త కేసు లేవన్నా వచ్చాయా — ఆలస్యంగా వచ్చారు" అడిగింది యినస్పెక్టర్ భార్య.

"కొత్త కేసేం కాదు — స్వంత కేసే. ఎవడో దొంగరాస్కెల్ నా పర్సే కొట్టేశాడు" చెప్పేడు డ్రస్ మార్చుకుంటూ.

"మీ పర్సు పోవడం ఏవిటి ? ఇంట్లోనే ఉందిగా" అని భర్తవైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఇంట్లోనే ఉందా !" ఈసారి తను కూడా ఆశ్చర్యపోయాడు యినస్పెక్టర్.

"అవును — మధ్యాహ్నం మీరు యింటి కొచ్చినప్పుడు మీ జేబులోంచి కిందపడింది. తీసి డ్రాయర్లో పెట్టాను. అప్పుడు చెప్పడం మర్చిపోయాను."

"అలాగ !" సాలోచనగా అన్నాడు యినస్పెక్టర్ సత్యం.

మరి హెడ్‌కానిస్టేబుల్ ఎలా తేగలిగాడు ఈ డబ్బు ? ఆలోచిస్తున్న యినస్పెక్టర్‌కి, మధ్యాహ్నంస్టేషన్‌లో తను చూసిన సుబ్రహ్మణ్యం రిపోర్టు గుర్తొచ్చింది. తన ఏరియాలో ఈరోజు అదొక్కటే పిక్‌పాకెట్‌కేసు. యస్... అలాగే జరిగుంటుంది. ఇప్పుడు తనేంచెయ్యాలి ?...

వ్యక్తిగత గౌరవం — వృత్తిగత నిజాయితీ, ధర్మకాటాకి రెండువైపులా సమానంగా తూగుతూ, తన నిర్ణయంకోసం ఎదురుచూస్తూ కనిపించాయి— సబ్‌యినస్పెక్టర్ సత్యానికి. ★